



అభ్యర్థులకు అవసరం.. పంచాయతీలకు ఆదాయం

- ఎన్నికల వేళ కచ్చితంగా లెక్కలు చెప్పాల్సిందే
- నామినేషన్ వేయాలన్నా, బలపరచాలన్నా నోడ్యూస్ తప్పనిసరి
- మొండి బకాయిలకూ కలగనున్న మోక్షం

ఆసిఫాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీల ఎన్నికల వేళ కొంత మేర గ్రామ పంచాయతీలకు ఆదాయం సమకూరనుంది. సుమారు రెండేళ్లుగా పంచాయతీల్లో పాలక వర్గం లేక పోవడంతో ప్రభుత్వం నుంచి నిధులు రాక పనులు చేయలేని పరిస్థితి నెలకొన్నది. సర్పంచ్, వార్డు సభ్యులకు పోటీ చేసే అభ్యర్థుల పేర ఏ విధమైన బకాయిలు ఉండకూడన్న ఎన్నికల కమిషన్ ఆదేశాలతోనే ఇది సాధ్యమైంది. నామినేషన్ పత్రాలతో పాటు ఇంటి పన్ను, ఇతరాత్రా పన్నులనీ చెల్లించినట్లు పంచాయతీ కార్యదర్శి జారీ చేసిన ధ్రువీకరణ పత్రం జత పర్చాల్సి ఉంటుంది. లేదంటే.. సదరు నామినేషన్‌ను ఎన్నికల అధికారులు తిరస్కరిస్తారు. ఈ విధంగా నిబంధనలు తప్పనిసరి అని చెబుతుండడంతో మొండి బకాయిలు సైతం వసూలవుతున్నాయి. పంచాయతీ ఎన్నికల పుణ్యామా అని పల్లెల్లో ఏళ్ల తరబడి పేరుకు పోయిన బకాయిలు వసూలవుతు న్నాయి. ఇంటికి సంబంధించిన పన్నులు చెల్లించాలని గతంలో అధికారులు ప్రజాప్రతినిధులు, ప్రజలకు ఎన్ని మార్లు మొరపెట్టుకున్నా వారు పట్టించుకోలేదు. ఫలితంగా పంచాయతీలకు ఆదాయం లేక ఏ చిన్న పనిని చేయించలేక పోయారు. పాలక వర్గాల నేతలు పన్నుల రాబడిపై అంతగా దృష్టిని సారించలేక పోయారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల సందడి ఊపందుకొంటుంది. నామినేషన్ వేయాలంటే సదరు అభ్యర్థి పంచాయతీకి ఎలాంటి బకాయిలు ఉండొద్దని ఎన్నికల కమీషన్ షరతును విధించింది. ఈ షరతే ప్రస్తుతం గ్రామాలకు ఆదాయాన్ని తెచ్చి పెడుతోంది.

ఏళ్ల తరబడి..

ఎన్నికల సమయంలో పంచాయతీలకు ఏళ్ల తరబడి పేరుకు పోయిన బకాయిలు వసూలవుతున్నాయి. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ, వార్డులకు పోటీ తీవ్రంగానే ఉంటోంది. ప్రస్తుతం పంచాయతీలకు నామినేషన్ దాఖలు చేయాలంటే ఇంటి పన్ను, ఇతర పన్నులకు విధిగా చెల్లించాలి. బకాయిలు చెల్లిస్తేనే నామినేషన్ వేయడానికి అర్హులవుతారు. లేకుంటే నామినేషన్ను తిరస్కరించనున్నారు. జిల్లాలో 335 పంచాయతీలు, 2874 వార్డులకు ఎన్నికలను నిర్వహిస్తున్నారు. ఒక్కో పంచాయతీకి కనీసం ముగ్గురు అభ్యర్థులు పోటీలో ఉండే అవకాశం ఉంది. తొలి విడత పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులుగా 425 మంది, వార్డులకు 1426 మంది నామినేషన్లు దాఖలు చేశారు.

మిగిలిన రెండు విడతల్లోనూ భారీ ఎత్తున నామినేషన్లు వేయనున్నారు. ఈ నేపథ్యంలో కనీసం ఆరు నుంచి ఎనిమిదివేల మంది పోటీలో ఉండే అవకాశం ఉంటుంది. ఈ పోటీలో ఉండే ప్రతీ అభ్యర్థి ముందుగానే ఇంటి పన్ను, ఇతర బకాయిలను చెల్లించాల్సిందే. వీటిని చెల్లించేందుకు ఆశావహులు అధికారుల వద్దకు వెళ్తున్నారు.

అందరి బాధ్యతా నాయకులదే..

ఎన్నికల్లో పోటీ చేసే వార్డు సభ్యుల పన్నులను ప్రధాన నాయకులే ముందుండి మరీ చెల్లిస్తున్నారు. కొన్ని గ్రామాలలో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు మిగితా వార్డు సభ్యులకు చెందిన పన్నులు చెల్లిస్తున్నారు. అభ్యర్థులతో పాటు ప్రతిపాదించే వారు కూడా సంబంధిత గ్రామంలో అన్ని రకాల పన్నులు చెల్లించాల్సి ఉండడంతో పంచాయతీలకు భారీగా నిధులు సమకూరుతున్నాయి. గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలు పన్నుల చెల్లించే వారితో సందడిగా కనిపిస్తున్నాయి.

ధ్రువీకరణ పత్రం ఉంటేనే..

గ్రామాల్లో ఇంటి పన్నులు చెల్లించినట్లయితే ఎలాంటి బకాయిలు లేవని ధ్రువీకరణ పత్రాన్ని సంబంధిత పంచాయతీ కార్యదర్శి ఇవ్వాల్సి ఉంటుంది. ఈ పత్రాన్ని జత పరిస్తేనే నామినేషన్ చెల్లుతుంది. లేకుంటే అధికారులు తిరస్కరిస్తారు. ఒక్కో అభ్యర్థి ఈ బకాయిలను చెల్లించాల్సి ఉం టుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఒక్కో ఇంటికి ఏడాదికి రూ.400 వరకు ఉంటుంది. పెద్ద ఇళ్లయితే గదికి రూ.150 చొప్పున ఎన్ని గదులు ఉంటే ఆ ఇం టికి అంత బకాయిని చెల్లించాల్సి ఉంటుంది. గ్రామాల్లో ఇంటి, ఇతర పన్నులు ఏళ్ల తరబడి చెల్లించకుండా ఉంటుంటారు. కనీసం ఒక్కో అభ్యర్థి మూడు నాలుగు సంవత్సరాల బకాయిలు చెల్లిం చాల్సి ఉంటుంది. దీంతో ప్రతి గ్రామం నుంచి అందే నిధులు బకాయిలు వసూళ్లు లక్షల్లోనే ఉం టుందని భావిస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో పంచాయతీలకు పెద్ద మొత్తంలో ఆదాయం లభిస్తుండడంతో కొంత ఆర్థిక వెసులుబాటు కలగనుంది.

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు

ఆసిఫాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నితికా పంత్ అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా బుధవారం రాత్రి ఆసిఫాబాద్ పట్టణ పరిధిలో ఉన్న రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భగా రౌడీషీటర్ల కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఎలాంటి వివాదాలకు వెళ్లకుండా దూరంగా ఉండేలా వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు. చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివాదాలు, గొడవల్లో తలదూర్చి కేసుల్లో చిక్కుకోవద్దని సూచించారు. ఎస్పీ వెంట సీఐ బాలాజీ వరప్రసాద్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పోలీసుల కవాతు



వాంకిడిలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

వాంకిడి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం వాంకిడి, ఖమాన, ఖిరిడి గ్రామాల్లో పోలీసులు కవాతు నిర్వహించారు. భారీగా పోలీసు బలగాలు పాల్గొని ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించారు. ఈ సందర్భంగా ఎస్సై మహేందర్ మాట్లాడుతూ గ్రామాల్లో జరుగుతున్న ఎన్నికల నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఎన్నికల నియమావళిని పాటించి ఎలాంటి ప్రలోభాలకు లోను కాకుండా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని తెలిపారు. ఎలాంటి అల్లర్లు, గొడవలు జరిగినా పోలీసులకు సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 14న నిర్వహించే సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల్లో భాగంగా బుధవారం సిర్పూర్(టి) మండల కేంద్రంలో జిల్లా ఎస్పీ నితికా పంత్ ఆదేశాల మేరకు కాగజ్‌నగర్ డీఎస్పీ వహీదుద్దీన్ ఆధ్వర్యంలో పోలీసు స్టేషన్ నుంచి ప్రధాన వీధుల గుండా పోలీసు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఈ నెల 14న 16 గ్రామ పంచాయతీల్లో ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని చెప్పారు. ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకో వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ సంతోష్‌కుమార్, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయూడబ్ల్యూజే(ఐజేయూ) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్ లోని పౌర సమాచార కమీషనర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన జర్నలిస్టులు పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రహెమాన్, నాయకులు ప్రకాష్ గౌడ్, జమీల్, శ్రీనివాసరావు, సురేష్‌చారి, రాధాకృష్ణచారి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించాలి

కాగజ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ బలపరుస్తున్న అభ్యర్థులను అధికమెజార్టీతో గెల్పించాలని బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. బుధవారం కాగజ్‌నగర్ కోసినిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన నాయకులు, కార్యకర్తలను పార్టీ కండువా వేసి ప్రవీణ్ కుమార్ ఆహ్వానించారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కును అందజేస్తున్న సూపరింటెండెంట్ గుంపస్వామి

బెజ్జూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రానికి చెందిన పులబోయిన తారాబాయికి బుధవారం తపాలా శాఖ ఆదిలాబాద్ సూపరింటెండెంట్ గుంపస్వామి రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును అందజేశారు. తారాబాయి భర్త రంగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన కింద రూ.435తో బీమా చేసుకోగా రెండు లక్షలు మంజూరు అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవనజ్యోతి యోజన, యాక్సిడెంట్ పాలసీ, ఇతర పోస్టల్ పథకాలను సద్వినియోగం చేసుకోవా లని కోరారు. బీమా చేయడం వల్ల కుటుంబానికి ఆర్థిక సాయం అందుతుందని ప్రతి ఒక్కరూ తపాల శాఖ అందించే బీమా చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇన్స్‌పెక్టర్ సతీష్, సీనియర్ మేనేజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక

తిర్యాణి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): తిర్యాణి మండలంలో బుధవారం గంగపుత్ర సేవా సంఘానికి చెందిన 20 మంది కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అనిల్‌గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. గంగపుత్ర సేవా సంఘం సభ్యులు విజయ్, రమేష్, సురేష్, పున్నం, దుర్గయ్య, ఆశయ, భీమన్న పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా అనిల్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలపేతానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకుల సాగర్, శంకర్, వెంకటేశం, హరీష్‌కుమార్, అమర్, రాజేష్, రవి, రంజిత్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర నిధులతో అభివృద్ధి చేస్తాం

కాగజ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచే అభ్యర్థులను గెలిపిస్తే కేంద్ర నిధులతో అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే కేంద్రం నుంచి నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేపడుతామని హామీ ఇచ్చారు. సమావేశంలో మాజీ సర్పంచి దోతుల శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

సికిల్‌సెల్‌ని అరికట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): సికిల్‌సెల్ వ్యాధిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని మాతా శిశు సంరక్షణ కో ఆర్డినేటర్ వాసుదేవ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జిల్లా వైద్య శాఖ కార్యాలయంలో సిర్పూర్ (యూ), వాంకిడి, లింగాపూర్ పీహెచ్‌సీల్లోని ఎంఎల్‌హెచ్‌పీలకు బుధవారం మాతా శిశు సంరక్షణ కో ఆర్డినేటర్ వాసుదేవ్ సికిల్ సెల్ జెనెటిక్ కార్డ్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ శిరీష్మ, కవిత, ప్రేమలత, మమత, సౌమ్య, ఉమ, రత్నమాల పాల్గొన్నారు.

జోరుగా మూడో విడత నామినేషన్లు



ఆడ నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ

ఆసిఫాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ బుధవారం ప్రారంభమైంది. మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 54, వార్డు స్థానాలకు 106 నామినేషన్లు దాఖలయ్యాయి. కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, రెబ్బెన, తిర్యాణి మండలాల్లోని 108 సర్పంచ్ స్థానాలకు, 938 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగనుండగా మొదటి రోజు ఆసిఫాబాద్ మండలంలో సర్పంచ్‌కు 9, వార్డులకు 32, కాగజ్‌నగర్‌లో సర్పంచ్‌కు 19, వార్డులకు 48, రెబ్బెనలో సర్పంచ్‌కు 19, వార్డులకు 18, తిర్యాణిలో సర్పంచ్‌కు 7, వార్డులకు 8 నామినేషన్లు దాఖలు కాగా మొత్తం సర్పంచ్ స్థానాలకు 54, వార్డు స్థానాలకు 106 నామినేషన్లు దాఖలయ్యాయి. అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మండలంలోని 27 గ్రామపం చాయతీలకు, 236 వార్డు స్థానాలకు బుధవారం నామినేషన్ల స్వీకరణ ప్రక్రియను అధికారులు నిర్వహించారు. మొదటి రోజు సర్పంచ్ స్థానాలకు 9 నామినేషన్లు, వార్డు స్థానాలకు 32 నామినేషన్లు దాఖలయ్యాయి. మండలంలోని మోతుగూడ, బూర్గుడ, రాజంపేట, ఆడ, తుంపల్లి, మోవాడ్, బాబాపూర్ క్లస్టర్లలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాలను జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకురాలు స్వప్న, జడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మౌనిక పరిశీలించారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ ప్రక్రియ బుధవారం కాగజ్‌నగర్ మండలంలో ప్రారంభమైంది. తొలి రోజు 28 గ్రామ పంచాయతీల కోసం ఎనిమిది కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ స్వీకరించేందుకు పూర్తి ఏర్పాట్లు చేశారు. కాగా కాగజ్‌నగర్ మండలం రేగులగూడ గత ఎన్నికల్లో ఎస్టీ రిజర్వేషన్ ఉండగా ఈ సారి మాత్రం బీసీ(మహిళ)కు కేటాయించారు. ఈ గ్రామంలో ఒకే కుటుంబం బీసీగా ఉండడంతో ఆమెతో నామినేషన్ వేయించనున్నారు.

వందశాతం పన్నులు వసూలు చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ మున్సిపాలిటీలో ఇంటి పన్నులు, నీటి పన్ను, ట్రేడ్ లైసెన్సు పన్ను వసూలు వంద శాతం చేయాలని మున్సిపల్ కమిషనర్ గజానంద్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన రివ్యూ సమావేశంలో ఆయన మాట్లాడారు. 2024-25 వరకు చెల్లించినటువంటి ఇంటి పన్ను మ్యానువల్ రిసిప్టులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేస్తామని అన్నారు. పట్టణ ప్రజలు 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఇంటి, నీటి పన్నులను, ట్రేడ్ లైసెన్సుల రుసుం సకాలంలో చెల్లించాలని చెప్పారు. పన్నుల వసూళ్ల కోసం మీ వద్దకు వచ్చే మున్సిపల్ సి బ్బందికి సహకరించాలని కోరారు. పట్టణాభివృద్ధికి పన్ను వసూళ్లే కీలకమని, ప్రజలు సకాలంలో చెల్లించాలని కమిషనర్ కోరారు. సమావేశంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ప్రాణహిత పరిసరాల్లో పులి అడుగులను గుర్తిస్తున్న అధికారులు

పెంచికలపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత తీర ప్రాంతంలో నుంచి పెద్దపులి ప్రవేశించిందని, పెంచికలపేట రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలోకి ప్రవేశించే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్ అన్నారు. పెద్దవాగు పరివాహక ప్రాంతంలోని కాళికాదేవి ఆలయం ఎదుట బుధవారం ఉదయం పులిపాద ముద్రలను అధికారులు గుర్తించారు. పెద్దవాగు మీద నుంచి దహెగాం మండలం వైపు పెద్దపులి వెళ్లినట్లుగా చెబుతున్నారు. ఈ విషయమై ఎఫ్ఆర్వో అనిల్‌కుమార్‌న మాట్లాడుతూ మహారాష్ట్ర సరిహద్దు ప్రాణహిత తీర ప్రాంతంలో నుంచి పెద్దపులి ప్రవేశించిందని అన్నారు. పెంచికలపేట రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతంలోకి ప్రవేశించే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, గుంపులు గుంపులుగా వెళ్లాలని సూచించారు. పశువుల కాపర్లు అటవీ ప్రాంతంలోకి పశువులకు మేతకు తీసుకు వెళ్లవద్దని అన్నారు. పులి ఎదురు పడితే దగ్గరికి వెళ్లకుండా ఎలాంటి హాని తలపెట్టకుండా అటవీ అధికారులకు సమాచారం అందించాలన్నారు. కాగా జిల్లాలో గత కొన్ని నెలలుగా పెద్దపులి కదిలికలు లేకుండా ఉన్నాయి. వారం రోజుల క్రితం తెలంగాణ- మహారాష్ట్ర సరిహద్ద ప్రాణహిత నది పరివాహక ప్రాంతంలో పులి కదిలికలు ఉన్నాయని అటవీ అధికారులు గుర్తించారు. ఏ క్షణానైనా జిల్లాలోకి ప్రవేశించే అవకాశం ఉందని అటవీ అధికారులు ముందుగానే గుర్తించి అటవీ ప్రాంత గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశారు. అనుకున్నట్లుగానే వారం రోజుల క్రితం మహారాష్ట్ర నుంచి కర్జెల్లి అటవీ ప్రాంతంలోకి ప్రవేశించింది. రెండు రోజుల ముందు బెజ్జూరు అటవీ ప్రాంతంలో అధికారులు పెద్దపులి కదిలికలను గుర్తించారు. ఈ మేరకు అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలో పులి సంచారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎఫ్ఎస్‌వో రవి అన్నారు. దహెగాం మండలంలోని లగ్గాం, ఒడ్డుగూడ గ్రామాల్లో ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, పత్తి తీసే కూలీలు గుంపులు గుంపులుగా వెళ్లాలని చెప్పారు. మహారాష్ట్ర నుంచి పెంచికలపేట మీదుగా పెద్దవాగు దాటి దహెగాం మండలంలో పులి ప్రవేశించిందని అటవీ అధికారులు గుర్తించారని అన్నారు. మండలంలోని గిరివెల్లి, ఖర్జీ, రాంపూర, మొట్లగూడ, దిగిడ, లోహ, రావులపల్లి, శంకరపురం, అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎఫ్ఎస్‌వో సద్దాంహుస్సేన్, ఎఫ్‌బీఓలు అసామ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ముగిసిన మొదటి విడత నామినేషన్ల ఉపసంహారణ

ఆసిఫాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్‌లో జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడతలో నామినేషన్ల ఉపసంహకరణ ప్రక్రియ బుధవారం ముగిసింది. మొదటి విడతలో జైనూరు, సిర్పూర్(యూ), లింగాపూర్, కెరమెరి, వాంకిడి మండలాల్లోని 114 గ్రామ పంచాయతీలకు, 944 వార్డు స్థానాలకు ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా మండలాల పరిధిలోని సర్పంచ్ స్థానాలకు 522, వార్డు స్థానాలకు 1,424 నామినేషన్లు దాఖలు అయ్యాయి. నామినేషన్లను అధికారులు పరిశీలించగా ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. ఇందులో లింగాపూర్ మండలంలోని ఎస్టీ మహిళకు రిజర్వు చేసిన కంచన్‌పల్లి గ్రామ పంచాయతీ, వాంకిడి మండలంలోని ఎస్టీ జనరల్‌కు రిజర్వు చేసిన దాబా, లెండిగూడ, నవేగూడ పంచాయతీలు, కెరమెరి మండలంలో ఎస్టీ జనరల్‌కు కేటాయించిన ధనోర, ఎస్టీ మహిళకు కేటాయించిన బాబేఝరి గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. లింగాపూర్ మండలం మండలం కంచన్‌పల్లి సర్పంచ్‌గా కనక పార్వతీబాయి ఏకగ్రీవమయ్యారు. కెరమెరి మండలంలోని ధనోరా సర్పంచ్‌గా గంగారాం, కెరమెరి మండలం బాబేఝరి సర్పంచ్‌గా టేకం లేతుబాయి, వాంకిడి మండలం దాబా సర్పంచ్‌గా కోట్నాక జంగు, వాంకిడి మండలం లెండిగూడ సర్పంచ్‌గా తాటి కుమారి, వాంకిడి మండలం నవేగూడ సర్పంచ్‌గా మడావి శేకు ఏకగ్రీవమయ్యారు. తొలి విడతలో 114 గ్రామ పంచాయతీలకు ఆరు పంచాయతీలు ఏకగ్రీవమయ్యాయి. మిగితా 108 పంచాయతీల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు.

నామినేషన్ ప్రక్రియ పరిశీలన

ఆసిఫాబాద్‌రూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూడో విడత ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను జిల్లా ఎన్నికల పరిశీలకురాలు స్వప్న బుధవారం పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమై వివరాలు అడిగి తెలుసుకుని సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, ఎంపీవో మౌనిక తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు చేయూతనివ్వాలి



గోలేటిలో దివ్యాంగ చిన్నారులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఇన్‌చార్జి జీఎం

రెబ్బెన, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులను చిన్నచూపు చూడకుండా చేయూతనిస్తే అన్ని రంగాల్లో రాణిస్తారని ఇన్‌చార్జి జీఎం నరేందర్ అన్నారు. రెబ్బెన మండలం గోలేటి టౌన్ షిపలోని సీఈఆర్ క్లబ్‌లో బుధవారం సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో అంతరజాతీయ దివ్యాంగుల దినోత్సవంను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా భీమిని, బెల్లంపల్లి, తాండూరు, గోలేఝ నుంచి వచ్చిన దివ్యాంగ చిన్నారులకు ఉదయం క్రీడా పోటీలు నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జి జీఎం నరేందర్ హాజరై క్రీడా పోటీల్లో విజేతలకు బహు మతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రపంచంలో పలు రంగాల్లో రాణిస్తున్న దివ్యాంగుల గురించి వివరించారు. దివ్యాంగులకు సేవ చేస్తున్న తల్లిదండ్రులు గౌరవనీయులని కొనియాడారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి తిరుపతి, అధికారుల సంఘం ప్రతినిధి ఉజ్వలకుమార్ బెహెరా, ఎస్‌ఓటు జీఎం రాజమల్లు, పర్సనల్ డిపార్టుమెంట్ హెచ్‌ఓడీ శ్రీనివాస్, సీనియర పర్సనల్ అధికారి ప్రశాంత్, ఉపాధ్యాయులు సుజాత, వెంకటేశ్వర్లు, సుచిరిత. రేష్మా, సతీష్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐఈఆర్‌పీ ఎంపీపీఎస్‌లో బుధవారం దివ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ జ్యోతి మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు అసాధారణ ప్రతిభ కలిగి ఉంటారని అన్నారు. వారు దేనినైనా సాధించే సత్తా ఉంటుందని చదువులోనే కాకుండా ఆటల్లోనూ తమ ప్రతిభను చూపాలని కొనియాడారు. అనంతరం విద్యార్థులచే కేక్ కట్ చేయించి బహుమతులు అందజే శారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సిబ్బంది, సీఆర్పీ శ్రీనివాస్ ఐఆర్‌పీ రజిత, విద్యార్థులు పాల్గొన్నారు.

వాంకిడి, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు పాటల పోటీలు, ఉపన్యాస, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థుల కు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వినేష్, ఐఈఆర్‌డీ తిరుమల భవిత కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ఎన్నికలకు ముగిసిన నామినేషన్లు

ఆసిఫాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు నిర్వహించే బెజ్జూరు, చింతలమానేపల్లి, కౌటాల, సిర్పూర్(టి), పెంచికలపేట, దహెగాం మండలాల్లో 113 సర్పంచ్ స్థానాలకు, 992 వార్డు స్థానాలకు నామినేషన్ల స్వీకరణ బుధవారం ముగిసింది. 113 సర్పంచ స్థానాలకు 737, 992 వార్డు స్థానాలకు 2.428 నామినేషనలు దాఖలు అయ్యాయి.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ధర్మపురి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని తీవ్ర గాయాలపాలైన వ్యక్తి మృతి చెందిన సంఘటన ధర్మపురి మండలంలో చోటు చేసుకుంది. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బనపల్లి గ్రామానికి చెందిన కుననపల్లి మురళి(48) ఈ నెల 1న సుతారీ మీటింగ్ నిమిత్తం రెబ్బనపల్లి గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా ధర్మపురి మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో పొలాల నుంచి వస్తున్న ఒక వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో మురళి ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. మురళిని 108లో జగిత్యాల ఆస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు.

సోషల్ వార్

- గ్రామాలు, పార్టీల వాట్సప్ గ్రూపుల్లో రాజకీయ చర్చలు
- ఎవరి వర్గానికి వారు మద్దతుగా పోస్టులు



బెజ్జూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల వేళ సోషల్ వార్ మొదలైంది. సామాజిక మాధ్యమ వేదికగా పంచాయతీ పోరు రసవత్తరంగా మారింది. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా పోస్టులు, కామెంట్లు ప్రత్యక్షమవుతున్నాయి. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా గ్రూపుల్లో పార్టీ శ్రేణులు, అభ్యర్థుల అనుచరులు యాక్టివ్ అయ్యారు. పార్టీలు, అభ్యర్థుల తరపున కార్యకర్తలు, అనుచరులు రాజకీయ పోస్టులతో మద్దతు పొందే ప్రయత్నం చేస్తున్నారు.

చర్చలకు వేదికలుగా..

పంచాయతీ ఎన్నికల వేళ వాట్సప్ గ్రూపులు రాజకీయ చర్చలకు వేదికలుగా మారుతున్నాయి. పార్టీలకు సంబంధించిన వివిధ గ్రూపులతో పాటు గ్రామాలు, కులసంఘాలు, యువజన సంఘాల పేరిట ఉన్న గ్రూపుల్లో ఎక్కడ చూసినా ఎన్నికలకు సంబంధించిన చర్చలు, పోస్టులే దర్శనమిస్తున్నాయి. నామినేషన్లు వేసిన, బరిలో ఉండబోతున్న అభ్యర్థులకు అనుకూలంగా, వ్యతిరేకంగా ఎవరికి వారు పోస్టులు పెడుతూ హీట్ పెంచుతున్నారు. పార్టీల మద్దతు ఆశించి బంగపడ్డవారు, వారి అనుచరులు పార్టీని, నేతలను విమర్శిస్తూ పోస్టులు పెడుతున్నారు.

ఓటర్లను ప్రసన్నం చేసుకునేలా..

పంచాయతీ ఎన్నికల్లో గెలిచేందుకు అభ్యర్థులు సోషల్ మీడియాను ఒక అస్త్రంగా మలుచుకోవాలని భావిస్తున్నారు. జిల్లాలో ఉన్న ఓటర్లలో పెద్దవారితో పాటు మహిళలు, యువకులు, యువతులకు మొబైల్ ఫోన్లు ఉన్నాయి. మొబైల్ ఫోన్లు ఉన్న ప్రతి ఒక్కరూ గ్రామ, యూత్ వంటి వాట్సాప్, ఫేస్‌బుక్ గ్రూపుల్లో ఉంటారు. సోషల్ మీడియాలో అనుకూలమైన పోస్టులు పెట్టడం ద్వారా ఓటర్లను కొంత మేర ప్రసన్నం చేసుకోవచ్చనే ఆలోచన అభ్యర్థుల్లో ఏర్పడుతోంది. దీనికోసం తమకు అనుకూలంగా పోస్టర్లు, కరపత్రాలు ముద్రించడం, పాటలు పాడించుకోవడం వంటి వాటిపై దృష్టి పెడుతున్నారు. వీటిని సోషల్ మీడియా ద్వారా నేరుగా ఓటర్ల వద్దకు చేర్చవచ్చని అభిప్రాయ పడుతున్నారు.

జిల్లాలో పంచాయతీ ఎన్నికల జోరు ఊపందుకుంది. మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు జరుగుతుండగా, ఇప్పటికే సోషల్ మీడియాలో ప్రచారం ఊపందుకుంది. సోషల్ మీడియా వేదికగా ఓ వైపు ఆయా రాజకీయ పార్టీల శ్రేణులు పోస్టులు పెడుతుండగా మరో వైపు రాజకీయాలకు దూరంగా ఉండే కొందరు యువకులు, ఇతరులు పెడుతున్న పోస్టులు ఆలోచింపజేసేలా ఉంటున్నాయి. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి గతాన్ని, భవిష్యత్తులో చేయబోయే మంచిని చూసి ఓటేయాలంటూ చేసే సూచనలు ఆకట్టుకుంటున్నాయి.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు



మాట్లాడుతున్న డీఎస్పీ వహీదోద్దీన్

కాగజ్‌నగర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణంలో గత నెల 28న ద్వారకానగర్‌లో జరిగిన చోరీ కేసును కాగజ్‌నగర్ పోలీసులు ఛేదించారు.స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వహీదోద్దీన్ కేసు వివరాలను వెల్లడించారు. ద్వారకానగర్‌లో నివాసం ఉంటున్న వీరమ్మ ఇంట్లోకి గత నెల 28న గుర్తు తెలియని వ్యక్తి వచ్చి మెడలో ఉన్న బంగారం గొలుసు, కొంత నగదు ఎత్తుకెళ్లినట్టు తెలిపారు. సీసీ పుటేజీలు, గతంలో జరిగిన చోరీ కేసుల ఆధారంగా పూర్తిగా వివరాలు సేకరించామని చెప్పారు. అనుమానితులు వేముల బాలకృష్ణ(బెల్లంపల్లి), బండి నిలేష్(రెబ్బెన) అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నట్టు తెలిపారు. ఈ ఘటనలో పాల్గొన్న కీలక వ్యక్తి రాజ్‌కుమార్(తాండూరు) పరారీలో ఉన్నట్టు తెలిపారు. వీరి వద్ద నుంచి సొత్తు రికవరీ చేసి రిమాండుకు తరలించామని అన్నారు. చోరీ కేసును ఛేదించిన కాగజ్‌నగర్ సీఐ ప్రేమ్‌కుమార్, ఎస్సైలను ఆయన అభినందించారు. సమావేశంలో సిఐ ప్రేమ్‌కుమార్, ఎస్సై సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు వెంటనే పరిష్కరించాలి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

శ్రీరాంపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కార్మికుల సమస్యలను పర్సనల్ విభాగం ఉద్యోగులు వెంటనే పరిష్కరించాలని జీఎం (పర్సనల్) ఐఆర్ అండ్ పీఎం కవితా నాయుడు అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీరాంపూర్ పర్సనల్ విభాగం అధికారులతో బుధవారం మాట్లాడుతూ, ఫ్రీ షైరింగ్ అప్లికేషన్ సింగరేణిలో కారుణ్య నియామకాలు, ఇతర ఉపాధి కేసులను పరిష్కరించడానికి వినియోగిస్తున్నామన్నారు. ఈ అప్లికేషన్ ద్వారా క్షేత్రస్థాయిలో క్లైయిమ్‌లను పరిష్కరిస్తామని, ఎస్ఏపీ హెచ్ఆర్ బృందం ద్వారా తుది నియామక ప్రక్రియలను పూర్తిచేస్తామని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల వివరాల నమోదు, ధృవీకరణ, తదితర విషయాలను, కాంట్రాక్ట్ కార్మికుల ఈఎస్ఐ వివరాలను త్వరగా ఆన్‌లైన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్లు రాజేష్, కిరణ్ కుమార్, సీనియర్ పీవోలు సురేందర్, మురళి, ప్రశాంత్, అన్ని గనుల సంక్షేమాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా అభివృద్ధికి ప్రాజెక్టులు అవసరం

మందమర్రిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మందమర్రి ఏరియా అబివృద్ధికి కొత్త ప్రాజెక్టులు అవసరమని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియా కార్యదర్శి భీమనాధుని సుదర్శన్ అన్నారు. స్థానికంగా బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ యాజమాన్యం ఏరియా అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఆర్కే ఓసీపీ విస్తరణకు ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందన్నారు. దీనిలో మెజార్టీలో ప్రజలు వెలుబుచ్చిన అంశాలను పరిగణలోకి తీసుకోవాలని అధికారులను కోరామన్నారు. ఈ ప్రాజెక్టు విస్తరణలో రెండున్నర దశాబ్దాల పాటు ఏరియాకు ఇబ్బంది ఉండదని, బొగ్గు బాగా వెలికితీసే అవకాశాలుంటాయన్నారు. ఓసీపీ ప్రభావిత ప్రజలకు సౌకర్యాలను కల్పించాలన్నారు. గుర్తింపు సంఘంగా కార్మికుల సంక్షేమానికి కట్టుబడి ఉంటామని తెలిపారు. మరిన్ని ప్రాజెక్టులు వస్తేనే మందమర్రికి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. తాము కూడా యాజమాన్యం ముందు అనేక అంశాలను పెట్టామని తెలిపారు. ఆర్కే ఓసీపీ విస్తరణ ద్వారా మందమర్రికి మంచి భవిష్యత్ ఉంటుందని తెలిపారు. సమావేశంలో నాయకులు రమణరావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణులు ఐక్యత చాటాలి

సంఘం రాష్ట్ర చైర్మన్ జగన్‌మోహనశర్మ

సిర్పూర్(టి), డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని బ్రాహ్మణులు ఐక్యత చాటాలని బ్రాహ్మణ సంఘం రాష్ట్ర చైర్మన్ జగన్ మోహనశర్మ అన్నారు. సిర్పూర్(టి)లో బుధవారం నిర్వహించిన బ్రాహ్మణ బంధువుల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. సంఘంలో సభ్యుల సంఖ్య పెంచడానికి సభ్యత్వ నమోదు చేపట్టాలని సూచించారు. డిమాండ్ల పరిష్కారానికి ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సంఘం బలోపేతానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. అనంతరం మడల కేంద్రంలోని కమలాకర్ కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న దత్తాత్రేయ స్వామి నవరాత్రుల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. అలాగే వేంకటేశ్వస్వామి, సంతోషిమాత ఆలయాలను సందర్శించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ శర్మ, విజయసారధి, ప్రవీణ్, కిరణ్‌కుమార్, గాయత్రి, సత్యనారాయణ శర్మ, కమలాకర్, ప్రకాష్, రమేష్, జయంత్‌రావు, రామారావు, ప్రదీప్, సుభాష్, సుగుణాకర్, కిశోర్, మధుకర్, శంకర్‌రావు, కాగజ్‌నగర్ బ్రాహ్మణ సంగం అధ్యక్షుడు రాజేశ్వర్‌రావు, దత్తన్న, గిరీష్, జగదీష్, నరేష్, శ్రీకేష్, వైభవ, శీరనివాస్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి విడత ఎన్నికలకు
పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

జైనూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొదటి విడత ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో బుధవారం సర్పంచ్, వార్డు స్థానాలకు ఈ నెల 11న నిర్వహించనున్న పోలింగ్ నిర్వాహణకు ఏర్పాటు చేసిన ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని ఆసిఫాబాద్ ఆర్డీవో లోకేశ్వర్‌రావ్‌తో పాటు కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు జిల్లాలోని జైనూర్ మండలంలో 26 సర్పంచ్ స్థానాలు, 222 వార్డు సభ్యుల స్థానాలకు తొలి విడతలో భాగంగా ఈ నెల 11న పోలింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఇతర ఎన్నికల సిబ్బంది ఈ నెల 10న ఉదయం 9 గంటలకు పంపిణీ కేంద్రంలో రిపోర్టు చేస్తారని అన్నారు. ఆ దిశగా ఏర్పాట్లు చేయాలని కోరారు. షామియానా, కుర్చీలు, టేబుల్లు సరిపడా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పంపిణీ కేంద్రంలో ఎన్నికల సామగ్రి పంపిణీ కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల నిర్వాహణ సిబ్బందికి తాగునీరు, అల్పాహారం, భోజన వసతి కల్పించాలని సూచించారు. సిబ్బందికి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, సీఐ రమేష్, ఎస్సై రవికుమార్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

ఆసిఫాబాద్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో పని చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో బుధవారం పంచాయతీ రాజ్, రహదారుల, భవనాల శాఖ, ఈడబ్ల్యూఐడీసీ, గిరిజన సంక్షేమ శాఖ, ఇంజనీరింగ్ అధికారులు, ఇతర అన్ని విభాగాల అధికారులతో జిల్లాలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో చేపట్టిన రహదారులు, వంతెనలు, కల్వర్టులు, పాఠశాల భవనాలు, అదనపు గదులు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాల భవనాలు, ప్రధానమంత్రి జన్‌మన్, జుగా పథకాల కింద చేపట్టి పనులను వేగవంతం చేయాలని తెలిపారు. వివిధ గ్రాంట్ల కింద మంజూరైన అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని చెప్పారు. ప్రధాన మంత్రి శ్రీ, సమగ్ర శిక్ష అభియాన్ కింద మంజూరైన పాఠశాల భవనాలు, అదనపు గదుల నిర్మాణాలు, మౌలిక వసతుల కల్పన పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు ఉపయోగపడేలా వినియోగంలోకి తీసుకు రావాలని తెలిపారు. ప్రధాన మంత్రి జన్ మన్, జుగా పథకాల కింద ఆదివాసీ గిరిజనుల గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారుల నిర్మాణం, సామాజిక భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, ఉప కేంద్రాల నిర్మాణాల్లో పూర్తి నాణ్యత పాటించాలని చెప్పారు. పనుల నిర్వహణలో ఇంజనీరింగ్ విభాగం అధికారులు నిర్లక్ష్యం వహించకూడదని సూచించారు. మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, 15వ ఆర్థిక ప్రాణాళిక కింద మంజూరైన నిధులను ఎంపిక చేసిన పనులకు మాత్రమే వినియోగించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో లేబర్ కాంపోనెంట్‌ను ఉపయోగించుకోవాలని అన్నారు. ఆకాంక్షిత తిర్యాణి బ్లాక్‌లో చేపట్టిన అభివృద్ధి పనుల లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి దత్తారావు, జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మీనారాయణ, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



శాంతిఖని గనిని రక్షించుకుందాం

బెల్లంపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శాంతిఖని గనిలో యాజమాన్యం కొన్ని రోజులుగా బొగ్గు ఉత్పత్తిని నిలిపివేసిందని, దీన్ని రక్షించుకునేందుకు ఏకమవ్వాలని ఏఐటీయూసీ సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి వెంకటస్వామి అన్నారు. శాంతిఖనిగనిపై బుధవారం నిర్వహించిన గేటు మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం శాంతిఖనిగనిలో బొగ్గు ఉత్పత్తిని నిలిపివేయడం సరైందికాదన్నారు. శాంతిఖనిగనికి సుదీర్ఘమైన భవిష్యత్ ఉందని బొగ్గు ఉత్పత్తికి ఆటంకం లేకుండా సంబంధించిన అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతిఖనిగనిని పరిరక్షించుకునేందుకు పార్టీలకు అతీతంగా ముందుకు వెళ్లాలలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు చిప్ప నర్సయ్య, రమేశ్, లక్ష్మీనారాయణ, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు పునరావాసం కల్పించాలి



డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

మందమర్రిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మందమర్రిలోని ఆర్కే ఓసీపీ విస్తరణలో భాగంగా నిర్వాసితులకు ఆర్థిక సహాయంతో పాటు మెరుగైన పునరావాసం కల్పించాలని టీడీపీ నాయకులు బుధవారం మందమర్రి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. పట్టణాధ్యక్షుడు వాసాల సంపత్ మాట్లాడుతూ యాజమాన్యం ఓసీపీ ఏర్పాటుతో ప్రజలు దుమ్ము ధూళితో ఇబ్బందులు పడతారని చెప్పారు. సమీప ఇళ్లు దెబ్బతింటాయన్నారు. వీటన్నిటిని దృష్టిలో ఉంచుకుని పునరావాసం కల్పించాలని కోరారు. నిర్వాసితుకు న్యాయం జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, సంధ్య, జయ, సుకన్య, కవిత, శ్రీను, స్వామి, రాజేష్, రమాదేవి, మమత తదితరులు పాల్గొన్నారు.

మెగా ఓసీపీతో ఏరియా అభివృద్ధి



మాట్లాడుతున్న జీఎం రాధాక్రిష్ణ

రామకృష్ణాపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్ మెగా ఓసీపీ ఫేజ్-2తో ఏరియా అభివృద్ధి జరుగుతుందని మందమర్రి ఏరియా జీఎం రాధాక్రిష్ణ అన్నారు. ఓసీపీ ఆవరణలో బుధవారం నిర్వహించిన ప్రజాభిప్రాయసేకరణలో జీఎం మాట్లాడారు. పర్యావరణ అనుమతుల తో పాటు జిల్లా రెవెన్యూ అనుమతులను వేగవంతం చేశాకనే ప్రజల అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకొని పనులను చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటి వరకు ప్రజలు ఎదుర్కొన్న, ఎదుర్కొబోతున్న సమస్యలన్నింటినీ పరిగణలోకి తీసుకొని మందమర్రి, సారంగపల్లి, క్యాతన్‌పల్లి, నస్పూర్ గ్రామాలను కలుపుతూ మెగా ఓసీపీ ఫేజ్-2 పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. రామకృష్ణాపూర్‌లో తాగు నీటి సమస్య, డ్రైనేజీ సమస్య, రోడ్ల సమస్యలను, వీధి దీపాల సమస్యలను, కార్మిక కాలనిలన్నింటిని అవసరం ఉన్న చోట మరమ్మత్తులు చేపట్టి కార్మికుల నివాసయోగ్యంగా ఉండేందుకు కాలనీలను నిర్మించేందుకు కాలనీలను నిర్మించేందుకు యాజమాన్యం చర్యలు చేపట్టనుంద ని తెలిపారు. ప్రజలంతా అభిప్రాయాలను వ్యక్తం చేయాలని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలోనే సింగరేణి అగ్రస్థానంలో ఉంటుందని దేశానికి వెలుగునింపే నల్లబంగారం బొగ్గు గనుల పరిశ్రమపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్దితో ప్రజలకు, కార్మికులకు అనేక సంక్షేమ కార్యక్రమాలను అందించేందుకు కృషి చేస్తున్నాయన్నారు. సింగరేణి సంస్థ సీఎండీ బల్‌రాం నాయక్ నేతృత్వంలో సింగరేణి డైరెక్టర్లు కార్మిక సంక్షేమ పథకాలపై దృష్టి సారించాలన్నారు. ఓసీపీ కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తవన్నారు. రానున్న ఆర్థిక సంవత్సరంలో పనులను మొదలుపెట్టనున్నట్లు తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ చంద్రయ్య, పర్యావరణ ఇంజనీర్ లక్ష్మణ్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సింగరేణి అధికారులు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంద న్నారు. రాష్ట్ర అభివృద్ధికి సింగరేణి సహకారం ఉన్నట్లే ప్రజల సంక్షేమం పై సింగరేణి కృషి చేయాలన్నారు. గుర్తింపు సంఘం నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య మాట్లాడుతూ ఈ ప్రాంత అభివృద్ధి విషయంలో యాజమాన్యం స్పష్టతతో కూడిన చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు, ఎస్ఓటు జీఎం ప్రసాద్, ఇన్విరాన్ మెంట్ అధికారి తిరుపతి, మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు, ఇన్విరాన్‌మెంట్ జీఎం సైదులు, రక్షణ, జనరల్ మేనేజర్ రఘుకుమార్, తహసీల్దార్ సతీష్, తదితరులు పాల్గొన్నారు.

- సింగరేణి అధికారులు తమ కాలనీ సమస్యలను మొదటి ఫేజ్‌లోనే విస్మరించారంటూ శాంతినగర్ కాలనీ వాసులు ఆందోళనలు చేపట్టారు. శాంతినగర్ నుంచి అన్ని కార్మిక సంఘాలు, ప్రజా ప్రతినిధుల నాయకులు ర్యాలీగా సభ ప్రాంతానికి ర్యాలీగా వెళ్లడంతో పోలీసులు అడ్డుకున్నారు.

నూతన కార్మిక చట్టాలు ప్రయోజనకరం



మాట్లాడుతున్న బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య

మందమర్రిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్ కార్మిక చట్టాలు 40కోట్ల కార్మికులకు ప్రయోజనకరమైనవని బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి సత్తయ్య అన్నారు. మందమర్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింగేణిలో కొన్ని సంఘాలు వారి మనుగడ పోతుందని ఆందోళన చేస్తున్నాయని రాజకీయ ప్రేరేపిత సంఘాలు వారి ప్రయోజనం కోసం పాటుపడుతున్నాయని ఉద్యోగులను తప్పుతోవ పట్టిస్తున్నాయన్నారు. 49 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా సవరించడం ద్వారా కార్మిక హక్కుల పరిరక్షణ సంస్థల సంరక్షణ పరిశ్రమ ప్రగతి, దేశ అభివృద్ధి, నిర్మాణాత్మకమైన పారదర్శకత ఉంటుందన్నారు. ఈ చట్టాలను తమ యూనియన్ స్వాగతిస్తుందని తెలిపారు. 1930-50 కాలంలో పాత చట్టాలను మార్పు చేసిన చట్టాలను పూర్తిగా ఆధునీకత, పారదర్శకత, ఏకీకృత కార్మిక కేంద్ర వ్యవస్థను తీసుకొస్తున్నాయని తెలిపారు. 14వ జాతీయ కార్మిక సంస్థల వేదికైనటువంటి కాన్సెంట్ సంస్కరణలను వికసిత భారత్ 2047 లక్ష్యాన్ని దారి తీసే చారిత్రాక అడుగా దీనిని అభివర్ణిస్తుందని తెలిపారు.. సమావేశంలో ఆ సంఘం కేంద్ర కమిటీ ఏరియా కమిటీ నాయకులు కారంపొడి శ్రీనివాసరాజు, డి. రమేశ్, గుర్రం ప్రదీప్‌కు మార్, జోగుల ఉదయ్‌కుమార్, వైద్య శ్రీనివాస్, దేవేందర్ పాల్గొన్నారు.

నీటి సరఫరాలో యాజమాన్యం విఫలం

శ్రీరాంపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్, మందమర్రి, రామకృష్ణాపూర్ లకు గోదావరి నుంచి రక్షిత తాగునీటిని సరఫరా చేయడంలో సింగరేణి యాజమాన్యం పూర్తిగా విఫలమైందని టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి అన్నారు. సీతారాంపల్లిలోని గోదావరి నది, ఇంటేక్ వెల్, పంప్‌హౌస్‌లను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. గత మూడు రోజులుగా శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్‌కే 6 కాలనీ, ఆర్‌కే 8 కాలనీ, ఆర్‌కే 6 గుడిసెలు, గాంధీనగర్, కృష్ణకాలనీలకు గోదావరి రక్షిత తాగు నీరు సరఫరా కావడం లేదన్నారు. మందమర్రి, రామకృష్ణాపూర్ ఏరియాలకు సైతం ఇదే పరిస్థితి ఉందన్నారు. సివిల్ విభాగం ఉద్యోగులను తగ్గించేందుకు ఇంటేక్‌వెల్ బంద్ చేసి మోటార్లను తొలగించారన్నారు. పర్మనెంట్ ఉద్యోగులు పనిచేసే చోట కాంట్రాక్ట్ కార్మికులను ఏర్పాటు చేస్తున్నారని, తద్వారా కాంట్రాక్టర్‌కు లాభం చేకూరుస్తున్నారని అన్నారు. కేవలం రెండు, మూడు కాలనీలకు మాత్రమే సరఫరా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం నీటి సరఫరాను పెంచి వచ్చే వేసవిలో ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆయన అధికారులను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేశ్, నాయకులు సత్తయ్య, రమేష్, మైపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని మృతదేహం

మంచిర్యాల క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం మార్కెట్ రోడ్‌లో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు మంచిర్యాల ఎస్‌హెచ్‌వో ప్రమోద్ రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సుమారు 60 సంవత్సరాల వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉన్నాడని, స్థానికులు అంబులెన్స్‌కు సమా చారం అందించడంతో అతడి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచామన్నారు. పూర్తివివరాల కోసం 8712656534 నంబర్‌లో కాల్ చేయాలని సూచించారు.

అయ్యప్ప పడిపూజ పోస్టర్లు విడుదల

శ్రీరాంపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8వ తేదీన నిర్వహించే అయ్యప్ప పడిపూజ పోస్టర్లను శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ బుధవారం విడుదల చేశారు. అనంతరం అఖిల భారత అయ్యప్ప ధర్మ ప్రచార సభ(ఏబీఏపీ) ఏరియా అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి భాస్కరి రాజేశం, వర్కింగ్ ప్రెసిడెంట్ వంగ శివకుమార్ మాట్లాడుతూ, కేరళకు చెందిన సంజీవ నంబూద్రి గురుస్వామి చేతులమీదుగా ఈ నెల 8న ప్రగతి మైదానంలో అయ్యప్ప మహా పడిపూజ ఉంటుందన్నారు. నగర సంకీర్తన, శోభాయాత్ర, అయ్యప్ప స్వాములకు భిక్ష, తదితర కార్యక్రమాలు ఉంటాయని, అయ్యప్ప భక్తులు భారీగా తరలిరావాలని వారు కోరారు.



టీ రూ.8 టిఫిన్ రూ.35

అభ్యర్థుల ఖర్చుపై డేగకన్ను

కట్టడికి ప్రత్యేక బృందాలు.. ఎప్పటికప్పుడు నమోదు

ప్రతీ పైసా పక్కాగా లెక్కగట్టనున్న అధికారులు

వ్యయ పరిమితి మించితే అనర్హత వేటు

నెన్నెల/వాంకిడి/ కౌటాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఓటర్లను మభ్యపెట్టేందుకు డబ్బులు, మద్యం పంపిణీ, హంగు, ఆర్భాటాలను అదుపు చేసేందుకు ఎన్నికల కమిషన్ అభ్యర్థులకు వ్యయ పరిమితి విధించింది. ఖర్చు తగ్గించి పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించేందుకు కట్టుదిట్టమైన నిబంధనలను జారీ చేసింది. అభ్యర్థులు టీ.. కాఫీ.. సమోసా ఇలా ఖర్చు చేసే ప్రతీ దానికి లెక్కగట్టనున్నారు. ఇందుకుగాను సర్పంచు, వార్డుసభ్యుల అభ్యర్థుల వ్యయంపై అధికారులు నిఘా పెంచారు. మద్యం.. డబ్బుల పంపిణీని కట్టడి చేసేందుకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటికల్, సర్వైలెన్స్ బృందాలను నియమించారు. అభ్యర్థుల ఖర్చుల వివ రాలను క్షుణ్ణంగా పరిశీలించే అధికారం ప్రత్యేక బృం దాలకు ఉంటుంది. నగదు తరలింపును అదుపు చేసేందుకు జిల్లాలో పలుచోట్ల 24 గంటలు పనిచేసే చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు. సరైన రసీదులు లేకుండా రూ. 50 వేల కంటే ఎక్కువ నగదు ఉంటే జప్తు చేసి ఆదాయపన్నుల శాఖ అధికారుల కు అప్ప గించాలని కలెక్టర్ అధికా రులను ఆదేశించారు.

టీ.. కాఫీ.. సమోసా కూడా లెక్కే..

ఎన్నికల్లో అభ్యర్థులు ఎక్కువ ఖర్చు చేసి తక్కువ చూపించే అవకాశం ఉన్నందున ఈసీ ప్రామాణికమైన రేట్లను నిర్ణయించింది. ప్రచారంలో సభలు సమావేశాల్లో అందించే టీ, కాఫీ, సమోసా కూడా లెక్కలోకి వస్తాయి. టీకి రూ. 8, కాఫీకి రూ. 10, సమోసాకు రూ. 15, టిఫిన్ రూ.35, వాటర్ బాటిల్‌కు రూ. 20, భోజనానికి రూ. 80, చికెన్ బిర్యాణీకి రూ. 140, మటన్ బిర్యాణీకి రూ.160లుగా నిర్ణయించారు.

మైకులు, వాహనాలకు ప్రత్యేక ధరలు..

ఎన్నికల్లో అభ్యర్థులు ప్రచారం కోసం సైకిల్ రిక్షా వినియోగిస్తే రోజుకి రూ. 400, అదే ఆటోరిక్షా అయితే రూ. 1500, టాటాఎస్ అయితే రూ. 1600, గా నిర్ణయించారు. 100 యాంప్స్ మైక్‌సెట్‌కు రూ. 2,500, వెయ్యి వాల్ పోస్టర్లకు రూ. ఐదు వేలుగా ప్రకటించారు. నెత్తిన ధరించే టోపీకి రూ. 40, టీషర్ట్‌కు రూ. 100 చొప్పున చెల్లించాలని సూచించారు. ఒకరోజుకు కారు అద్దెను రూ. 2,500, ఇన్నోవాకు రూ. 3,500, చూపాల్సి ఉంటుంది. కూర్చునేందుకు వినియోగించే ఒక్కో కుర్చీకి రోజుకు రూ. 20గా చొప్పున లెక్కిస్తారు. బహిరంగ సభలు, ర్యాలీలు, సమావేశాలను పూర్తి స్థాయిలో వీడియో తీస్తారు. వేర్వేరుగా లెక్కలు కట్టి ఖర్చులను నమోదు చేస్తారు. ఇందుకుగాను ప్రతీ మండలానికి ఒక ఫ్లయింగ్ స్క్వాడ్ ఉంటుంది. మండలానికి నియమించిన పరిశీలకుల పర్యవేక్షణలో అభ్యర్థుల ఖర్చులను లెక్కగడతారు.

లెక్కలు చెప్పకపోతే అనర్హత వేటు

పోటీ చేసే అభ్యర్థులు ప్రచారానికి సంబంధించిన ప్రతి పైసాకు లెక్క చెప్పాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలు జారీ చేసింది. అభ్యర్థుల వ్యయ పరిమితిని ఖరారు చేసింది. ఐదువేల లోపు జనాభా ఉన్న జీపీల్లో సర్పంచ్ అభ్యర్థులు రూ. 1.50 లక్షలు, వార్డు సభ్యులు రూ. 30 వేలు ఖర్చు చేసుకోవచ్చు. ఐదు వేలకు మించి జనాభా ఉంటే సర్పంచ్ అభ్యర్థి రూ.2.50 లక్షలు, వార్డుసభ్యులు రూ. 50 వేలు మాత్రమే ఖర్చు చేయాలి. అంతకంటే ఎక్కువ ఖర్చు చేస్తే చర్యలు తీసుకోనున్నారు. ఎన్నికల ఖర్చుల లెక్కల నిర్వహణపై అభ్యర్థి సెల్ఫ్ డిక్లేరేషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎన్నికలకు సంబంధించి ఖర్చు చేసిన వ్యయాలన్నింటిని విడిగా, వాస్తవ లెక్కలను ఈసీ నిర్దేశించిన ఫార్మట్‌లోనే అందజేయాల్సి ఉంటుంది. ఇతర విధాలుగా లెక్కలు సమర్పిస్తే వాటిని పరిగణలోకి తీసుకోరు. గెలిచిన తర్వాత 45 రోజుల్లోగా లెక్కలు చూపని పక్షంలో పదవినే రద్దు చేస్తారు. అభ్యర్థులు సమర్పించిన లెక్కలతో అధికారులు సంతృప్తి చెందకపోతే సదరు ప్రజాప్రతినిధిపై అనర్హత వేటు వేస్తారు. ఇకపైన ఏదేని పదవి కోసం నిర్వహించే ఎన్నికలలో పోటీ చేయడానికి మూడు సంవత్సరాల పాటు అనర్హుడిగా ప్రకటిస్తారు.



సర్పంచ్ ఎన్నికలకు పోటాపోటీ

(5వ పేజీ తరువాయి)

ప్రక్రియలో సర్పంచ్ స్థానాలకే డిమాండ్ అధికంగా కనిపిస్తోంది. మూడో విడత నామినేషన్లు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. మూడో విడత కింద చెన్నూర్ నియోజకవర్గంలోని కోటపల్లి, చెన్నూరు, భీమారం, జైపూర్, మందమర్రి మండలాల్లోని 102 సర్పంచ్ స్థానాలు, 868 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఇక్కడ కూడా సర్పంచ్ స్థానాలకే అధిక పోటీ నెలకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ఓడితే పరిషత్ వైపు...

గ్రామపంచాయతీ ఎన్నికల్లో భాగంగా సర్పంచ్ స్థానాలకు పోటీపడుతున్న అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలనే పట్టుదలతో ఉన్నారు. ఇప్పటికే వారికి ప్రధాన పార్టీల ముఖ్య నాయకుల మద్దతు లభించగా ఎన్నికల్లో సత్తాచాటేందుకు అన్ని అస్త్రాలను ఉపయోగిస్తున్నారు. రిజర్వేషన్ల వారీగా గెలుపు గుర్రాలకే అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు మద్దతు తెలుపగా తమ శాయశక్తుల ప్రయత్నిస్తూ ఎన్నికల్లో గెలుపొందేందుకు అభ్యర్థులు ఉవ్విళ్లూరుతున్నారు. ఒక వేళ సర్పంచ్ ఎన్నికల్లో ఓడినా రాబోయే జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికల్లోనైన పైచేయిసాధించాలనే తపనతో అధికశాతం మంది అభ్యర్థులు ఉన్నారు. ఇందు కోసం ఇప్పటి నుంచే వారు తమ ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. ఎలాగైనా స్థానిక ఎన్నికల్లో గెలుపొందాలనే పట్టుదలతో ఉన్న అభ్యర్థులు సర్పంచ్ కాకపోతే ఎంపీటీసీ, జడ్పీటీసీలుగానైనా ఎన్నికవ్వాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇందు కోసం గ్రామాల ప్రజలను తమ వైపు ఆకర్షించేలా ప్రత్యేక కార్యాచరణ చేపడుతూ వస్తున్నారు. మొత్తంగా ఈసారి ఎన్నికలను మిస్ చేసుకోవద్దనే దృఢమైన లక్ష్యంతో అభ్యర్థులు పోటీపడుతుండడం గమనార్హం.

రాహుల్‌గాంధీని కలిసిన పెద్దపల్లి ఎంపీ



ఎంపీలు రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీలతో పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ

మందమర్రిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు, ఎంపీ రాహుల్‌గాంధీ, సోనియాగాంధీలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కలిసి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ బుధవారం ఢిల్లీ కలిశారు. ఈ నెల 8,9 తేదీల్లో హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగబోయే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని ముఖ్యమంత్రి ఆహ్వానించగా ఎంపీ కూడా ఉన్నారు. సమ్మిట్ తెలంగాణ అభివృద్ధికి కీలక మైలుగా నిలుస్తుందని, జాతీయస్థాయిలో సహకారం అత్యంత ముఖ్యమనే విషయంపై ముఖ్యమంత్రితో వారితో చర్చించారని ఎంపీ తెలిపారు.

నామినేషన్ల ప్రక్రియ సజావుగా నిర్వహించాలి



కిష్టంపేటలోని నామినేషన్ కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మూడో విడత నామినేష్ సర్పంచు, వార్డు సభ్యుల నామినేషన్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని ఆర్డీవో శ్రీనివాసరావు అధికారులకు సూచించారు. మండలంలోని కిష్టంపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ నామినేషన్ వేసే అభ్యర్థులకు హెల్ప్ డెస్క్ ద్వారా వివరాలు తెలియజేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జున్, ఎంపీడీవో మోహన్, సీఐ దేవేందర్‌రావు, ఆర్ఐ అజీజ్, ఎంపీవో అజ్మత్ అలీ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నస్పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ లైను షిఫ్టింగ్ కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్కే 6, క్యాతన్‌పల్లి(ఆర్‌కేపీ), అవుడం సబ్‌స్టేషన్లలో సరఫరా నిలిచిపోతుందన్నారు. జైపూర్ 33 కేవీ కుందారం ఫీడర్‌లో ఉందయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నామినేషన్ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలి

కలెక్టర్ కుమార్‌దీపక్





బెల్లంపల్లిలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, వేమనపల్లిలో బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్..

బెల్లంపల్లి, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నామినేషన్ ప్రక్రియలో అభ్యర్థులు సమర్పించిన పత్రాలను ఎన్నికల సంఘం నిబంధనలకు లోబడి క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. బుధవారం మండలంలోని బూదకుర్తి, చాకపల్లి గ్రామాల్లో రెండో విడత నామినేషన్ల పరిశీలన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. నామినేషన్ ప్రక్రియ నుంచి ఎన్నికల ఫలితాలు ప్రకటించే వరకు ఎన్నికల నోటిఫికేషన్, నామినేషన్, పోటిలో ఉండే అభ్యర్థుల తుదిజాబితా, పోస్టల్ బ్యాలెట్ పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు, ఇతర అంశాలపై అప్రమత్తంగా ఉండాలని అధికారు లకు సూచించారు. నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి జాబితా పూర్తి వివరాలతో రూపొందించాలన్నారు. అనంతరం మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మహేందర్, పాల్గొన్నారు.

నామినేషన్ కేంద్రాల పరిశీలన

వేమనపల్లి: మండలంలోని వేమనపల్లిలో ఏర్పాటుచేసిన నామినేషన్ కేంద్రాలను బెల్లంపల్లి సబ్‌కలెక్టర్ మనోజ్ బుధవారం పరిశీలించారు. ఎన్నికల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. బుధవారం నామినేషన్ల పరిశీలనలో రెండు నామినేషన్లు తిరస్కరణకు గురైనట్లు ఎంపీడీవో కుమారస్వామి తెలిపారు. నాగారం గ్రామ పంచాయతీకి సర్పంచ్ స్థానానికి వేసిన ఒక నామినేషన్, కల్లెంపల్లిలో వార్డుమెంబర్ స్థానానికి వేసిన ఒక నామినేషన్ తిరస్కరణకు గురైనట్లు తెలిపారు.

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్ లోని నామినేషన్ కేంద్రంలో నామినేషన్ల పరిశీలనను బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్ పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. సర్పంచు, వార్డు సభ్యులకు అభ్యర్థులు వేసిన నామినేషన్ల పరిశీలన పూర్తయిందని ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. మండలంలో 15 గ్రామపంచాయతీలు ఉండగా 83 మంది నామినేషన్లు వేశారు. స్క్రూటినీ చేయగా 83 మంది బరిలో ఉన్నారన్నారు. అలాగే 144 వార్డులకు గాను 370 మంది బరిలో ఉన్నారని తెలిపారు.

ఒక సర్పంచు, 42 మంది వార్డు సభ్యుల ఏకగ్రీవం

కాసిపేట: మండలంలోని 22 గ్రామపంచాయతీల్లో సర్పంచ్ స్థానం కోసం 113 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా 190 వార్డులకు 393 మంది నామినేషన్ పత్రాలు సమర్పించారు. దేవాపూర్ పంచాయతీలోనే 15 మంది సర్పంచ్ పదవికి నామినేషన్లు దాఖలు చేయడం విశేషం. బుధవారం జరిగిన స్క్రూటిని అనంతరం ధర్మారావుపేట గ్రామపంచాయతీ నుంచి ఒక్కరే నామినేషన్ వేయడంతో ఆస్థానం ఏకగ్రీవం అయింది. 42 మంది వార్డుసభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం అప్పీలుకు చివరి తేదీ కాగా, శుక్రవారం అప్పీళ్ల పరిష్కరణ, ఆరోతేదీన ఉపసంహరణతో గడువు ముగుస్తుంది. అదేరోజు సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను అధికారులు ప్రకటించనున్నారు.

పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలి



మంచిర్యాలలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న బీసీ నాయకులు

మంచిర్యాల క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్‌లో బీసీ బిల్లును ప్రవేశపెట్టాలని బీసీ సంఘం నాయకులు జిల్లా కేంద్రంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి నాయకులు మాట్లాడుతూ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లోనే బీసీ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదింపజేయాలని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కల్పించాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీలను మోసం చేస్తున్నాయని ఈసందర్భంగా విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు రాజేషం, శెట్టి గట్టయ్య, సూరయ్య, గజెల్లి వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

పులి సంచారం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అటవీ మార్గాన్ని శుభ్రం చేస్తున్న సిబ్బంది

జైపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెగడపల్లి, గంగిపల్లి, నర్సింగాపూర్, మద్దుల పల్లి, కుందారం అటవీ ప్రాంతంలో పెద్దపులి సంచారం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెగడపల్లి సెక్షన్ ఆఫీసర్ ముజావొద్దీన్ తెలిపారు. ప్రజలు ఎవరు కూడా పంట పొలాల చుట్టూ కరెంటు, ఉచ్చులు పెట్టవద్దని, అటవీ సమీపంలో పొలం పనులు చేసుకునే వారు త్వరగా పనిముగించుకుని గుంపులుగా ఇంటికి వెళ్లాలన్నారు. పశువులు, గొర్రెల కాపరులు అటవీ శాఖ ఆధ్వర్యంలో సమాచారం ఇచ్చే వరకు అడవిలోకి వెళ్లరాదని, ఎవరికైనా పులి పాదముద్రలు కనిపిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. జైపూర్ అటవీ ప్రాంతంలో పులి పాదముద్రలను గుర్తించేందుకు బుధవారం అటవీ సిబ్బందితో అనుమానం ఉన్న అటవీ మార్గాల్లో పులి పాదముద్రలు కనిపించేలా శుభ్రం చేయించినట్లు సెక్షన్ ఆఫీసర్ తెలిపారు.

పులికి ఎలాంటి హాని కలిగించొద్దు

భీమారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో కొద్ది రోజులుగా పెద్దపులి సంచరిస్తోందని పులికి ఎలాంటి హానీ చేయవద్దని బీట్ ఆఫీసర్ అనిత పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల క్రితం నెన్నెల మండలం నుంచి భీమారం మండలానికి చేరుకుందన్నారు. బుధవారం జైపూర్ అటవీ ప్రాంతంలోకి వెళ్లిందన్నారు. ఎవరు కూడా పంట పొలాలకు కరెంటు వైర్లు, ఉచ్చులు బిగించవద్దన్నారు. పులికి హాని చేస్తే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అటవీ ప్రాంతంలోని పశువులు, గొర్ల కాపర్లు వెళ్లవద్దన్నారు. అడవుల సమీపంలో పొలాల్లోకి వెళ్లే వారు త్వరగా పనులు ముగించుకుని ఇళ్లకు చేరుకోవాలన్నారు.

బీజేపీలో పలువురి చేరిక

జన్నారం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన పలువురు ఇందన్‌పల్లి బీజేపీ గ్రామ అధ్యక్షుడి ఆధ్వర్యంలో బీజేపీలో చేరారు. మంత్యర్తి హనుమాండ్లు కుటుంబ సభ్యులతో పాటు యువకులు చేరినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, వంగపల్లి సురేశ్, చుంచు వినయ్, శ్రీకాంత్, తిరుపతి పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం





మందమర్రిలో సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు , చెన్నూరులో నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

మందమర్రిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): హిందూ దేవుళ్లను అవమానపరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ పట్టణంలోని రాష్ట్రీయ రహదారిపై సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు బుధవారం దహనం చేవారు. రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు చప్పిడి నరేష్, ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి రొడ్డ మోహన్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉండి హిందూ కుటుంబంలో జన్మించి హిందూ దేవుళ్లను అవ మానపర్చడం సరైంది కాదన్నారు. ఎవరి విశ్వాసాలు వారివని పేర్కొన్నారు. వెంటనే సీఎం బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అదుపులోకి తీసుకున్నా రు. కార్యక్రమంలో నాయకులు డీవీ దీక్షితులు, శ్రీనివా స్, రాములు, సత్యంబాబు, శేఖర్, రాజు, మహేష్, నాగేష్, శ్యాంసుందర్, ప్రవీణ్, తిరుపతి పాల్గొన్నారు.

బెల్లంపల్లి: హిందూ దేవుళ్లను కించపరిచే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి వాఖ్యలు చేశారని బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం సీఎం దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం పలువురి నాయకులు మాట్లాడుతూ సీఎం పదవిలో ఉండి హిందూ దేవతలను అవమానపరిస్తూ మాట్లాడడం సిగ్గుచేటన్నారు. హిందువుల ఓట్లతో సీఎంగా పీటం ఎక్కి ప్రస్తుతం రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా కొనసాగే హక్కులేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొయ్యల ఏమాజీ, సంతోష్ కుమార్, దార కళ్యాణి, తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకున్న పోలీసులు..

చెన్నూరు: హిందూ దేవతలను అవమానపరిచేలా మాట్లాడిన సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు బుధవారం సాయంత్రం చెన్నూరు పట్టణంలో దహనం చేయడానికి యత్నించారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని బీజేపీ నాయకులను అడ్డుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ వెంటనే సీఎం హిందువులందరికి బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. హిందువుల ు అవమానపర్చిన మాజీ సీఎం కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి పడుతుందని విమర్శించారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

నెన్నెల మండలంలో ఆరు వార్డులు ఏకగ్రీవం

నెన్నెల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సర్పంచు స్థానాలకు, వార్డు సభ్యుల ఎన్నిక కోసం మూడు రోజుల పాటు స్వీకరించిన నామినేషన్ల పరిశీలన కొనసాగుతోంది. మండలంలోని 19 గ్రామపంచాయతీలకు గాను మొత్తం 373 నామినేషన్లు వచ్చాయి. సర్పంచ్ స్థానాలకు 124 నామినేషన్లు, వార్డు మెంబర్లకు 239 నామినేషన్లు దాఖలయ్యాయి. మెట్‌పలి లోని రెండో వార్డు, జోగాపూర్‌లోని ఐదు, ఆరు వార్డుల్లో ఒకే నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవం కానున్నాయి.

కొత్తూరు గ్రామంలో రెండు, ఏడో వార్డులు, చిన్నవెంకటాపూర్‌లో ఒకటవ వార్డులో ఒకే నామినేషన్ దాఖలు కావడం తో ఆయా వార్డులు ఏకగ్రీవం కానున్నాయి. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయించనున్నారు. ఎంపీడీవో మహమ్మద్ అబ్దుల్ హై, ఎంపీవో శ్రీనివాస్ నామినేషన్ల ప్రక్రియను పర్యవేక్షించారు.

తెలుగు అక్షర క్రమంలో పంచాయతీ ఎన్నికల గుర్తులు

నామినేషన్ పత్రంలో అభ్యర్థులు పేరు ఆధారంగా కేటాయింపు

దండేపల్లి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మొదటి దశ పంచాయతీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే నామినేషన్ల ప్రక్రియ స్క్రూటినీ పూర్తయింది. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ పూర్తయిన వెంటనే బరిలో నిలిచిన అభ్యర్థులకు అధికారులు గుర్తులు కేటాయింటారు. రాజకీయ పార్టీల గుర్తులు లేకుండానే పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో అభ్యర్థుల పేర్లలో తెలుగు అక్షర క్రమంలో గుర్తులు కేటాయింపు ఉంటుం దని అధికారులు తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ పత్రాల్లో వారి పేర్లను ఎలా పేర్కొన్నారో అలాగే తెలుగు అక్షరాల క్రమాన్ని గుర్తించి పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించారు.

ఘనంగా దివ్యాంగుల దినోత్సవం



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

మందమర్రిరూరల్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఎంపీడీవో రాజేశ్వర్, ఎంఈవో రాథోడ్ రమేష్‌లు మాట్లాడుతూ దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరు ప్రేమగా ఉండాలని, అన్ని రంగాల్లో వారిని ప్రోత్సహించాలన్నారు. దివ్యాంగులకు భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలైన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఆర్‌పీలు సరిత, శంకర్, మధు తదితరులు పాల్గొన్నారు.


భీమారం: భీమారం మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో దివ్యాంగుల దినోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. దివ్యాంగ పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. దివ్యాంగులకు ప్రతి ఒక్కరు సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం పిల్లలకు, తల్లిదండ్రులకు భోజన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు సమ్మయ్య, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ సునీల్, సీసీవో ఇంతియాజ్, సీఆర్‌పీ సాగర్ పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై జాగ్రత్తగా ఉండాలి



మంచిర్యాల క్రైం, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు, యువతులు సోషల్ మీడియా మాధ్యమాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, మహిళల కోసమే షీటీం పని చేస్తుందని రామగుండం సీపీ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనటలో తెలిపారు. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, బస్టాండ్లు, కూడళ్ల వద్ద మఫ్టీలో ఉంటూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి మహిళలకు రక్షణ కల్పిస్తున్నామన్నారు. ర్యాగింగ్‌కు పాల్పడిన వారిపై ఈవ్ టీజింగ్, పోక్సో కేసు, గుడ్,బ్యాడ్ టచ్, మహిళా చట్టాలపై ప్రతీఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, సమస్య ఎదురైతే 100కు డయల్ చేయాలని సూచించారు. వేధింపులు, అసభ్య ప్రవర్తన, సమస్యలు ఎదురైతే ధైర్యంగా పోలీసులకు తెలియజేయాలని, వారిపేర్లను గోప్యంగా ఉంచి వారికి న్యాయం చేస్తామన్నారు. మంచిర్యాల జోన్ పరిధిలో 8712659386కు కల్ చేయాలని సూచించారు. మంచిర్యాల పరిధిలో 34 అవగాహన సదస్సులను ఏర్పాటు చేశామని, జిల్లాలో 115 హాట్‌స్పాట్‌లను గుర్తించామన్నారు. మహిళలు, బాలికల భద్రత కోసమే షీటీం నిరంతరంగా పని చేస్తుందని తెలిపారు.

సర్పంచ్ ఎన్నికలకు పోటాపోటీ



- సగటున ఒక్కో స్థానంలో ఆరుగురి పోటీ
- ముగిసిన మొదటి విడత నామినేషన్ల ఉపసంహరణ

మంచిర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సర్పంచ్ ఎన్నికలకు పోటాపోటీ నెలకొంది. గత నెల 25న పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఆ మరునాడు నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లాలో మూడు విడతలుగా పంచాయతీ ఎన్నికలను నిర్వహించేందుకు ఈసీ షెడ్యూల్ జారీ చేసింది. దీంతో గత నెల 27 నుంచి 29 వరకు మొదటి విడత నామినేషన్ల ప్రక్రియ కొనసాగింది. మొదటి విడతలో భాగంగా మంచిర్యాల నియోజకవర్గంలోని హాజీపూర్, లక్షెట్టిపేట, దండేపల్లితో పాటు ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం మండలాల్లో నామినేషన్ ప్రక్రియ పూర్తయింది. అలాగే రెండో విడతలో బెల్లంపల్లి నియోజకవర్గంలోని బెల్లంపల్లి, తాండూర్, నెన్నెల, భీమిని, వేమనపల్లి, కన్నెపల్లి, కాసిపేట మండలాల్లో ఈనెల రెండో తేదీతో నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. మూడో విడతలో చెన్నూర్ నియోజక వర్గంలోని చెన్నూర్, కోటపల్లి, భీమారం, జైపూర్, మందమర్రి మండలాల్లో బుధవారం నుంచి నామి నేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నెల 5వ తేదీ తో నామినేషన్ల పర్వం ముగియనుంది. మొదటి విడత ఎన్నికలు ఈనెల 11న, రెండో విడతలో 14వ తేదీన, మూడో విడతకు సంబంధించి 17వ తేదీన పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నారు.

మొదటి విడతలో 518 నామినేషన్లు..

ఇప్పటి వరకు రెండు విడతల నామినేషన్ ప్రక్రియ పూర్తికాగా దాఖలైన నామినేషన్లను పరిశీలిస్తే సర్పంచ్ పదవులకే అధిక ప్రాధాన్యం కనిపిస్తోంది. మొదటి విడతలో మంచిర్యాల నియోజకవర్గానికి సంబంధించి దాఖలైన నామినేషన్లలో 90 సర్పంచ్ స్థానాలకుగానూ మొత్తం 518 నామినేషన్లు దాఖలయ్యాయి. 816 వార్డు స్థానాలకుగాను 1,749 నామినేషన్‌లు దాఖలయ్యాయి. సర్పంచ్ స్థానాల్లో దాదాపు ఆరు రెట్లు అధికంగా నామినేషన్లు దాఖలుకాగా వార్డు మెంబర్లకు రెట్టింపు సంఖ్యలో మాత్రమే నామినేషన్లు రావడం గమనార్హం.

రెండో విడత బెల్లంపల్లి నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 114 సర్పంచ్ స్థానాలు ఉండగా గడువు ముగిసే సరికి సర్పంచ్ స్థానానికి 758 నామినేషన్లు దాఖలయ్యాయి. నియోజకవర్గంలో మొత్తం 996 వార్డు మెంబర్ల స్థానాలకుగాను 2,454 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇక్కడ కూడా సర్పంచ్ స్థానానికి దాదాపు ఆరు రెట్లు అధికంగా నామినేషన్లు దాఖలు కాగా వార్డు మెంబర్ల స్థానాలకు రెట్టింపు సంఖ్యలోనే నామినేషన్లు వచ్చాయి. ఇప్పటి వరకు ముగిసిన రెండు విడతల నామినేషన్ల..

(మిగతా 7లో..)

శ్రీకాంతాచారికి ఘన నివాళులు



నస్పూర్‌లో శ్రీకాంత్‌చారి చిత్రపటం వద్ద విశ్వబ్రాహ్మణుల నివాళులు

నస్పూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): నస్పూర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం ఎదుట విశ్వబ్రాహ్మణుల ఆధ్వర్యంలో తెలంగాణ కోసం అమరుడైన శ్రీకాంతాచారి వర్ధంతిని బుధవారం నిర్వహించారు. శ్రీకాంతాచారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో తెలంగాణ విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మహాసభ రాష్ట్ర కార్యదర్శి నరసింహాచారి, జిల్లా వర్కింగ్ ప్రెసి డెంట్ తేలికుంట్ల రాజాచారి, సభ్యులు రాజమౌళి గురువయ్య, చంద్రమౌళి, శ్రీనివాస్, కిషన్‌చారి పాల్గొన్నారు.

కాసిపేట: మండలంలోని దుబ్బగూడెంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిచిన కార్యక్రమంలో నాయకపోడ్ సేవా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

పత్తిలో గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు

కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం ప్రసూన

నెన్నెల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పత్తి పంటలో గులాబీ రంగు పురుగు (పింక్ బోల్ వార్మ్) ఉధృతి అధికంగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారని, రైతులు తగిన నివారణ చర్యలు చేపట్టాలని బెల్లంపల్లి కృషివిజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం ప్రసూన సూచించారు. బుధవారం విడుదల చేసిన పత్రిక ప్రకటనలో జిల్లా రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. శాస్త్రవేత్తల బృందం పలు జిల్లాల్లో పత్తి చేలను సందర్శించి పురుగు ఉధృతిని గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున పురుగు ఉధృతికి అనుకూల వాతావరణం ఉందన్నారు. గులాబీ పురుగు సోకితే 60 శాతం పంట దిగుబడి తగ్గుతుందని, పంటకాలం ఆరునెలలు దాటకుండా చూసుకోవాలన్నారు. పత్తి సేకరణ అనంతరం చెట్లను తొందరగా తొలగించకుండా నీటి తడులు ఇస్తూ పంటకాలం పొడిగిస్తే ఆపద కొనితెచ్చుకున్నట్లేనని పేర్కొన్నారు. డిసెంబరు ఆఖరు కల్లా పత్తి సేకరించుకొని పంటను కాటన్ ష్రెడర్, రోటోవేటర్ ఉపయోగించి తొలగించుకోవాలన్నారు. పంట మార్పిడి చేసుకుంటే మంచిదని సూచించారు. ప్రస్తుతం పురుగు సోకిన చేలల్లో సైపర్‌మెత్రిన్ 1 మిల్లీ లీటరు లేదా లామ్డా సహలోత్రిన్ లేదా క్లోరాంత్రనిప్రోల్‌తో పాటు లామ్డాసహలోత్రిన్ 0.5 మిల్లీ లీటరు ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని పేర్కొన్నారు. రైతులు సామూహికంగా గులాబీ రంగు పురుగు నివారణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు ఉంటాయని సూచించారు.

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను గుర్తించండి

జిల్లా వైద్యాధికారి అనిత



కాసిపేట ఆసుపత్రిలో మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి అనిత

కాసిపేట డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): వైద్య సిబ్బంది మండలంలో పర్యటించి దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులను గుర్తించాలని చికిత్సలు అందించాలని జిల్లా వైద్యాధికారి అనిత సూచించారు. బుధవారం కాసిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని రికార్డులను పరిశీలించారు. వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 30 ఏళ్ల పైబడిన వారందరికీ వైద్య పరీక్షలు నిర్వహించాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన పెంచాలన్నారు. గత నెలలో మండలంలోని సాముగూడకు చెందిన అనురాధ ప్రసవించిన వెంటనే తల్లి, కొడుకు ఇద్దరు మృతిచెందగా బుధవారం కుటుంబాన్ని పరామర్శించి విచారం వ్యక్తం చేశారు. ఆమె వెంట కాసిపేట మెడికల్ ఆఫీసర్ దివ్య, సూపర్ వైజర్ ఆర్ఎస్ పద్మ, డీపీహెచ్ఎన్ వసుమతి, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

భీమిని: శిశు మరణాలను తగ్గించేందుకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాని మంచిర్యాల డీఎంహెచ్ఓ అనిత సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. మండలంలో వడాల, కన్నెపల్లి మండలంలో మెట్టుపల్లి గ్రామంలో శిశువులు మృతి చెందడంతో ఆమె సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆసుపత్రి రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు అనిల్ కుమార్, సీహెచ్‌వో జలపతి, డీపీహెచ్ఎన్ పద్మ, హెచ్ఎస్ వసువతి, ఇందిర, హెల్త్‌అసిస్టెంట్ ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారికి కొవ్వొతులతో నివాళి

దండేపల్లి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): అభంశుభం తెలియని ఆరేళ్ల చిన్నారిని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ దండేపల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి యువకులు, గ్రామస్థులు కొవ్వొతులతో నివాళీ అర్పించి ర్యాలీ చేపట్టారు. మండలంలోని ఓ గ్రామానికి చెంది చిన్నారిని గత నెల 24న హత్యాచారం చేసిన నిందితులపు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

పాత మామిడిపల్లిలో ఉత్కంఠ

దండేపల్లి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం పాత మామిడిపల్లి సర్పంచ్ ఏకగ్రీవంపై ఉత్కంఠ నెలకొంది. సర్పంచ్ బరిలో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎలైపు వైష్ణవి, బీఆర్ఎస్ నుంచి గుర్రాల మాధవి నామినేషన్ వేశారు. బుధవారం మధ్యాహ్నం 3గంటలకు నిమినేషన్ ఉపసంహరణ సమయం ముగిసిన గంట తర్వాత బీఆర్ఎస్ అభ్యర్థి మాధవి నామినేషన్ ఉపసంహరించుకునేందుకు వచ్చారు. దీంతో బీఆర్ఎస్ నాయకులు సమయం అయిపోయేకా ఎలా ఉపసంహరించుకుంటవాని అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు జోక్యం చేసుకున్నారు. లక్షెట్టిపేట సీఐ రమణమూర్తి, ఎస్సై తహసీనోద్దీన్ పోలీసు సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఆందోళనకారులు చెదరగొట్టారు. ఎంపీడీవో జేఆర్ ప్రసాద్, తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండే చేరుకొని ఉన్నతాధికారుల సూచన మేరకు మామిడిపల్లి సర్పంచ్‌గా ఎలైపు వైష్ణవిని ఏకగ్రావంగా ఎన్నికైనట్టు అధికారులు ప్రకటించారు.

ఏకగ్రీవమైన నలుగురు సర్పంచులు



ఇప్ప రవళి
కొండాపూర్



కుడిమేత తిరుపతి
ముత్యంపేట



కస్తూరీ చిన్న పోషం
కొత్త మామిడిపల్లి



ఎ వైష్ణవి
పాత మామిడిపల్లి

దండేపల్లి డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలంలోని కొండాపూర్, ముత్యంపేట, కొత్త మామిడిపల్లి, పాత మామిడిపల్లి గ్రామపంచాయతీలో నలుగుగు సర్పంచ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నామినేషన్ ఉపసంహరణ కార్యక్రమంలో భాగంగా పోటీలో ఉన్న పలువురు అభ్యర్థులు నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో నలుగురు సర్పంచులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. కొండాపూర్ గ్రామంలో ఇప్ప రవళి, ముత్యంపేటలో కుడిమేత తిరుపతి, కొత్త మామిడిపల్లిలో కస్తూరి చిన్న పోషం, పాతమామిడిపల్లిలో ఎలైపు వైష్ణవి సర్పంచ్‌లుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా వీరు నలుగురూ కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులే. మండలంలోని 31 గ్రామపంచాయతీలు ఉండగా 24 పంచాయతీల్లో సర్పంచులు, వార్డు సభ్యులకు ఎన్నికల అధికారులు గుర్తులు కేటాయించారు. నెల్కివెంకటాపూర్, వందుర్‌గూడ, గూడెం గ్రామాల్లో ఒక్కరు కూడా నిమినేషన్ వేయకపోవడంతో అక్కడ ఎన్నికలు జరగడం లేదు.

లక్షెట్టిపేట: లక్షెట్టిపేట మండలంలో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో 18గ్రామాల్లో సర్పంచ్ స్థానాలను ఏకగ్రీవం చేసేందుకు నాయకులు నానా తంటాలు పడ్డారు. అయినా ఒక్క గ్రామంలో కూడా సర్పంచ్ అభ్యర్థులు ఏకగ్రీవం కాలేదు. మండలంలోని వెంకట్రావుపేట, తిమ్మాపూర్, బలరావుపేట, పాత కొమ్ముగూడెం, కొత్తూర్ గ్రామాలు చివరి వరకు ఏకగ్రీవం అవుతాయన్న నమ్మకంతో నాయకులు ఉన్నప్పటికీ ఫలించలేదు. కొన్ని చోట్ల కాంగ్రెస్ పార్టీ బలపర్చే అభ్యర్థులకు బీఆర్ఎస్ పార్టీ బలపరిచే అభ్యర్థులు రాజీకి వచ్చినా బీజేపి బలపరిచిన అభ్యర్థులు రాకపోవడంతో ఒకటి రెండు చోట్ల కాంగ్రెస్, బీజేపీ నాయకులు బలపరిచే అభ్యర్థుల మధ్య పోటీ ఉండనుంది. మండలంలోని 18 గ్రామాలకు కలిపి 160వార్డులు ఉండగా 28వార్డులు ఏకగ్రీవమయ్యాయి. హన్మంత్‌పల్లి గ్రామంలో ఎనిమిది వార్డులకు గాను మొత్తం ఏకగ్రీవం కాగా.. మిట్టపల్లి, గుల్లకోట, రంగపేట, చందారం, దౌడేపల్లి, ఎల్లారం గ్రామాల్లో ఒక్కో వార్డు ఏకగ్రీవం అయ్యాయి. తిమ్మాపూర్, సూరారంలో మూడు వార్డులు, కొత్తకొమ్ముగూడెంల నాలుగు, వెంకట్రావుపేటలో ఆరు వార్డులు ఏకగ్రీవమైనట్లు సమాచారం.

జన్నారంలో..

జన్నారం: మండలంలోని పొన్కల్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తొమ్మిది మంది నామినేషన్ వేయగా అందులో ఆరుగురి ఒకే సారి విడ్రా అయ్యారు. దీంతో ముగ్గురు జక్కు సుష్మా భూమేశ్, సుల్వ లక్ష్మీ జనార్దన్, దర్శనాల అనసూయ మల్లేశ్ ముగ్గురు బరిలో నిలిచారు.

హాజీపూర్‌లో..

హాజీపూర్: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో 39 మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. 22 వార్డుస్థానాలు ఏకగ్రీవం కాగా 84 వార్డులకు పోటి జరుగనుండగా 197 మంది బరిలో ఉన్నారు. సర్పంచ్, వార్డు సభ్యులకు గుర్తులు సైతం కేటాయించారు.

పల్లెల్లో రాజకీయ పండగ

విందు వినోదాలతో హంగామా

కాసిపేట, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి పల్లెల్లో రాజకీయ పండగ వాతావరణం కనబడుతోంది. సర్పంచు అభ్యర్థులు యువకులను గ్రూపుల వారీగా విభజించి మచ్చిక చేసుకునేందుకు విందులు, వినోదాలతో హంగామాచేస్తున్నారు. రాజకీయ నిరుద్యోగులకు ఈ 15 రోజులు మంచి ఉపాధి లభించనుంది. పార్టీ జెండాలు లేకపోయినప్పటికీ వ్యక్తిగత అజెండాను ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు బృందాలుగా ఏర్పాటు చేసి ఏరియాలను అప్పజెబుతున్నారు. పల్లెల్లో ఎక్కడ చూసినా రాజకీయాలపైనే చర్చ జరుగుతుంది. ఊరికి ఉపకారం చేయడం ఎలా ఉన్నా ఈ రోజు మందుకు డబ్బులు ఇవ్వాలని అడిగే వారి సంఖ్య పెరిగిపోతుంది. దీనికి తోడు మందు బాబులతో సర్పంచు అభ్యర్థులకు తలనొప్పిగా మారింది. రోజు మందుకు డబ్బులు ఇచ్చి ఒక్క రోజు డబ్బులు ఇవ్వకుంటే ప్రత్యర్థి వర్గంలో చేరి అతనికే జేజేలు కొట్టడం అభ్యర్థులను కృంగదీస్తుంది. ఇదిలా ఉండగా సర్పంచు అభ్యర్థులు సైతం అక్క, బావ అంటూ ఆత్మీయ పలకరింపులతో అదరగొడుతున్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఎలాగైనా గెలిచి కుర్చీ ఎక్కాలని స్థానిక ఓటర్లను ఉదయం, సాయంత్రం ఇళ్ల వద్దనే ప్రసన్నం చేసుకుంటున్నారు. యువతకు క్రికెట్ కిట్‌లు, ఆట వస్తువులతో ఆకర్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఓటర్లు ఎప్పుడు అందుబటులో ఉంటారో పక్కా సమాచారంతో అభ్యర్థులు ప్రచారం నిర్వహిస్తూ హల్‌చల్ చేస్తున్నారు.

పంచాయతీ ఎన్నికల్లో ప్రతిపక్షాలకు పరాభవమే

- మంత్రి వివేక్‌వెంకటస్వామి



మందమర్రిలో మాట్లాడుతున్న మంత్రి వివేక్‌వెంకటస్వామి

మందమర్రిటౌన్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరిగే పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు 95 శాతం స్థానాల్లో విజయం సాధిస్తారని, ఎన్నికల్లో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి పరాభవం తప్పదని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, గనుల శాఖ మంత్రి వివేక్‌వెంకటస్వామి అన్నారు. గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేయడంతో పాటు వాటిని పట్టణాలకు దీటుగా అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించిందన్నారు. బుధవారం పట్టణంలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను క్రమక్రమంగా అమలు చేస్తున్నామన్నారు. సన్నబియ్యం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల విద్యుత్ ఫ్రీ, నూతన రేషన్ కార్డులు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదేనని తెలిపారు. ఈ ఎన్నికల్లో వీటినే ప్రచారాస్త్రాలుగా నాయకులు ఉపయోగించాలని సూచించారు. అనంతరం పంచాయతీల్లో పోటీ చేసే అభ్యర్థులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

సింగరేణిలో కొత్త ప్రాజెక్టులు రావాలి

సింగరేణిలో కొత్త ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని దీనికి సంబంధించి తమ ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి డాక్టర్ జి. వివేక్ వెంకటస్వామి తెలిపారు. మందమర్రి ఏరియాలోని ఆర్కే ఓసీ విస్తరణతో ఏరియాకు భవిష్యత్ ఉంటుందని తెలిపారు. ఓసీ విస్తరించే ప్రాంతాల్లో ప్రజల డిమాండ్లను కూడా యాజమాన్యం పరిష్కరించాలన్నారు. త్వరలోనే జైపూర్ పవర్‌ప్లాంట్‌లో ప్లాంట్ విస్తరణ పనులు చేపడతామని తెలిపారు. దీని ద్వారా చాలా మంది ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. అంతేగాకుండా స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర ద్వారా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించాలని చెప్పడంతో సింగరేణి యాజమాన్యం స్థానికులనే తీసుకుంటుందన్నారు. సింగరేణిలో నాలుగు బొగ్గు బ్లాకుల కు సంబంధించి ఒరిస్సా తరహాలోనే వేలం పాటంలో దక్కించుకోవాలని కోరుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, స్థానిక నాయకులు ఉపేందర్‌గౌడ్, సొత్కు సుదర్శన్, గుడ్ల రమేష్, శ్రీనివాస్, నర్సింగ్, ఇసాక్, జావేద్, సంగి సంతోష్, ఆకారం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మూడో విడత తొలిరోజు 180 నామినేషన్లు

- సర్పంచ్ స్థానాలకు 92
- వార్డు సభ్యులకు 88 దాఖలు



మంచిర్యాల, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో భాగంగా మూడో విడత మొదటి రోజు 180 నామినేషన్లు దాఖలయ్యాయి. చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రి, చెన్నూర్, జైపూర్, కోటపల్లి, భీమారం మండలాలకు సంబంధించి మొత్తం 102 సర్పంచ్ స్థానాలు, 868 వార్డు మెంబర్ల స్థానాలు ఉన్నాయి. వాటికిగాను బుధవారం సర్పంచ్ స్థానాలకు 92, వార్డు మెంబర్ల స్థానాలకు 88 నామినేషన్లు దాఖలయ్యాయి.

● **చెన్నూరు:** మండలంలో 30 పంచాయతీలకుగాను 15 పంచాయతీల్లో సర్పంచు స్థానానికి 30, వార్డు సభ్యుల స్థానాలకు 20 నామినేషన్‌లు దాఖలైనట్లు ఎంపీడీవో మోహన్ తెలిపారు. కాగా మిగిలిన 15 పంచాయతీల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

జైపూర్: మండలంలోని ఐదు నామినేషన్ కేంద్రాల్లో 16 మంది సర్పంచు అభ్యర్థులు నామినేషన్‌లు దాఖలు చేయగా, 22 మంది వార్డు సభ్యులు నామినేషన్‌లు వేసినట్లు ఎంపీడీవో సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలో 20 గ్రామపంచాయతీలు ఉండగా మొదటి రోజు మందకోడిగా నామినేషన్‌లు కొనసాగాయి.

మందమర్రిరూరల్: మండలంలో 12 సర్పంచు, 12 వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

భీమారం: మండలంలో 11 గ్రామ పంచాయతీలకుగాను భీమారం, మద్దికల్, బూరుగుపల్లి, ఖాజీపల్లిలో నామినేషన్ స్వీకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి రోజు మండలంలో మొత్తం సర్పంచు స్థానానికి 15, వార్డు సభ్యుల స్థానాలకు ఐదు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో మధుసూదన్ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎస్ఐ శ్వేత ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కోటపల్లి: మండలంలోని 31 పంచాయతీలకు గాను 13 పంచాయతీల్లో 19 మంది అభ్యర్థులు నామినేషన్‌లు వేశారు. అలాగే 29 మంది వార్డు సభ్యుల స్థానాలకు నామినేషన్‌లు దాఖలు చేశారు. కోటపల్లి పంచాయతీ సర్పంచ్ స్థానం జనరల్‌కు కేటాయించగా మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్‌కుమార్ సతీమణి పురాణం సునంద నామినేషన్ వేశారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి



శెట్‌పల్లిలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

జైపూర్, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాల్లో నామినేషన్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల పరిశీలకుడు మనోహర్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని జైపూర్, ఇందారం, శెట్‌పల్లిలోని నామినేషన్ స్వీకరణ కేంద్రాలను పరిశీలించారు. నామినేషన్ వేసే అభ్యర్థుల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో తీసుకుంటున్న సౌకర్యాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణ, తహసీల్దార్ వనజారెడ్డి, ఎంపీవో శ్రీపతి బాపురావు, సిబ్బంది ప్రసాద్, సత్తయ్య, పంచాయతీ కార్యదర్శులు, జీపీవోలు పాల్గొన్నారు.

రహదారి విస్తరణపై అధికారుల సర్వే

అడ్డుకున్న ఇంటి యజమానులు



రహదారి కొలతలు తీస్తున్న మున్సిపల్ అధికారులు

చెన్నూరు, డిసెంబరు 3 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణంలోని అంబేడ్కర్ చౌక్ నుంచి కోటపల్లి బస్టాప్ రాగిచెట్టు వరకు రహదారి విస్తరణపై మున్సిపాలిటీ అధికారులు బుధవారం సర్వే చేపట్టగా సర్వేను ఇంటి యాజమానులు అ డ్డుకున్నారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా రోడ్డు వెడల్పు కార్యక్రమం ఎలా చేపడతారని దుకాణాలు, బిల్డింగుల యాజమానులు అధికారులను నిలదీశారు. ముందుగా బైపాస్ రహదారిని పూర్తి చేసి పట్టణం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలను ఆ రహదారి గుండా మళ్లించాలని కోరారు. రోడ్డు వెడల్పులో రహ దారి సెంటర్ నుంచి ఎన్ని ఫీట్లు తీస్తారో స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. ఎలాంటి నోటీసులు జారీ చేయకుండా రోడ్డు వెడల్పు ఎలా చేపడతారని ప్రశ్నించారు. యాజమానులు సర్వేను అడ్డుకోవడంతో మున్సిపాలిటీ అధికారులు వెనుదిరిగి వెళ్లిపోయారు.